


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 11-02-2023 సంపుటి : 04 సంచిక : 148 పేజీలు : 4 వెల : రూ 3-00


## మార్చి 22 తర్వాత విశాఖకు జగన్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 10, రాష్ట్ర పరిపాలన రాజధానిగా విశాఖపట్నం ఉండబోతుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పరిపాలనా రాజధానిని అమరావతి నుంచి వైజాగ్‌కు మార్చేందుకు



అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్లు సమాచారం. ఈ క్రమంలో ముఖ్యమంత్రి అధికారిక నివాస భవనంతో ఇతర భవనాల ఏర్పాటుకు విశాఖపట్నం జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఐతే రాష్ట్ర రాజధాని తరలింపుపై జిల్లా అధికారులకు ఇంకా అధికారిక ఉత్తర్వులు రానప్పటికీ, అధికారులు మాత్రం ముందస్తు గ్రౌండ్ వర్క్ ప్రారంభించినట్లు సమాచారం. దీంతో ఉత్తర్వులు ఎప్పుడైనా వెలువడే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విశాఖలో ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని బీచ్ రోడ్డులో ఖరారు చేసే అవకాశం ఉంది. అన్నీ కుదిరితే మార్చి 22 లేదా 23న ముఖ్యమంత్రి గృహప్రవేశం చేసే అవకాశం ఉందనే టాక్ జోరందుకుంది. అలాగే ఇతర అడ్మినిస్ట్రేసన్ బిల్డింగ్‌లను గుర్తించే పనిలో అధికార యంత్రంగం నిమగ్నమయ్యారు.కాగా న్యూఢిల్లీలో జరిగిన సభలో జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం త్వరలో రాష్ట్ర రాజధాని అవుతుందని ప్రకటించిన విషయం తెలిసిందే. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో భాగంగా..' రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజధానిగా మారబోతున్న విశాఖపట్నానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. నేను కూడా త్వరలో విశాఖపట్నంకు షిఫ్ట్ అవుతానని' సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు.2019లో జగన్ సర్కార్ మూడు రాజధానుల ఆలోచనను రూపొందించింది. విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, అమరావతి శాసనసభ రాజధానిగా ఉండబోతుందనే ప్రతిపాదన తీసుకొచ్చింది. ఐతే రాజధాని తరలింపుపై 33 వేల ఎకరాల భూమిని ఇచ్చిన అమరావతి రైతుల నిరసనల దృష్ట్యా రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఆరు నెలల్లో అభివృద్ధి చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిని సవాళ్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా.. హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.

## 'చాలా సంతోషంగా ఉన్నాం.. జగనన్న మీరే మళ్లీ సీఎం కావాలి'



అమరావతి: అక్టోబర్–డిసెంబర్ 2022 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 4,536 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద రూ.38.18 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రులు, లబ్ధిదారులు ఏమన్నారంటే.. వారి మాటల్లోనేఅందరికీ నమస్కారం, ఈ రోజు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అనే గొప్ప కార్యక్రమాలు ఈ రాష్ట్రంలోని పేద కుటుంబాలకు అండగా, సహాయంగా ఉంటాయి. ఇది చాలా గొప్ప కార్యక్రమం. సీఎంగారు చదువుకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో అర్ధమవుతుంది. నాడు బీఆర్ అంబేద్కర్‌గారు ఎడ్యుకేషన్ ఈజ్ ద వెపన్ అన్న మాట అమలుచేస్తున్నారు.డ్రాపౌట్స్ రేట్స్ తగ్గాయి, ఇటీవల మైసూర్ లో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో 9 రాష్ట్రాల వారు వచ్చిన సమావేశంలో ఒక్క ఏపీలోనే ఈ రోజు డ్రాపౌట్స్ శాతం తగ్గుతుందని చెప్పారు, ఇది గర్వకారణం. పదవ తరగతి పాసైన వారికే అర్హత అనేది మంచి ఆలోచన, దీని వల్ల చదువుకు ప్రాధాన్యతనిస్తారు. మీ ధైర్యానికి హ్యాట్సాఫ్, మీరు చేస్తున్న ఈ కార్యక్రమం ఫలప్రదమవుతుందని ప్రగాఢంగా నమ్ముతున్నాను. ఈ గొప్ప కార్యక్రమాల వెంట ప్రజలంతా నడుస్తారని కోరుకుంటున్నాను. థ్యాంక్యూ.నమస్కారం జగనన్నా, అన్నా మా నాన్న కూలీ పనులు చేసి మమ్మల్ని చదివించారు, మమ్మల్ని ప్రయోజకులను చేశారు, పెళ్ళి చేయాలనుకుని ఆలోచిస్తుండగా మాకు ఈ కళ్యాణమస్తు ద్వారా ఆర్ధిక సాయం జరుగుతుందని తెలిసి మేం సంతోషించాం, మాకు ఈ సాయం అందుతుంది, ధన్యవాదాలు అన్నా, మా నాన్న మమ్మల్ని చదివించడానికి చాలా ఇబ్బందులు పడ్డారు, మీరు ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు అందాయి.మేం పోడు భూములు సాగుచేసుకుంటున్నాం, మీరు మాకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా ఇవ్వడంతో మాకు రైతు భరోసా సాయం అందుతుంది, ఆ డబ్బుతో మేం వ్యవసాయం చేసుకుంటున్నాం, మా అమ్మకు వైఎస్సార్ చేయూత, ఆసరా అందుతున్నాయి, మా జీవనోపాధి మెరుగైంది, మా చెల్లి కూడా మీ పథకాల వల్ల సాయం పొందింది. మీరే మాకు ఎప్పటికీ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాను. మా నాన్నకు కుమారులు లేరు. మీరు మాకు అన్నగా ముందుండి నడిపించారు. మా కుటుంబం తరపున, మా పేదలందరి తరపునా మీకు ధన్యవాదాలు అన్నా. థ్యాంక్యూ. అన్నా నమస్తే, మీరు ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ కళ్యాణమస్తు వల్ల మాకు మేలు జరిగింది. దీని వల్ల మాలాంటి చాలామంది ఆడపిల్లలు సంతోషంగా ఉన్నారు. కన్నతండ్రికి కూతురు పెళ్ళి చేయాలంటే ఎంత భారమో తెలుసు, కానీ మీరు ఈ పథకం ద్వారా సాయం చేస్తున్నారు. తండ్రులంతా కూడా మా కొడుకులాగా మీరు సాయం చేశారని గర్వంగా చెప్పుకుంటున్నారు. నేను చాలా సంతోషంగా ఉన్నాను. నాలాంటి ఎన్నో కుటుంబాలు ఇదే సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. మేం ఐదుగురు ఆడపిల్లలం, మీరు ప్రవేశపెట్టిన విద్యాదీవెన, వసతిదీవెన ద్వారా డిగ్రీ పూర్తిచేయగలిగాం, మా నాన్నగారు మమ్మల్ని ధైర్యంగా చదివించారంటే మీరే కారణం.మా చెల్లెల్లకు కూడా అన్ని పథకాలు అందుతున్నాయి. మేం స్కూళ్లో చదువుకున్న రోజుల్లో ఇవన్నీ లేవు, తనకు ట్యాబ్ కుడా ఇవ్వడంతో మరింత ఇంట్రెస్ట్‌గా చదువుకుంటుంది, మేం ఐదుగురు ఆడపిల్లలం చదవగలిగాం అంటే మీ పథకాల వల్లే, అందరూ ఆశ్చర్యంగా చూశారు ఎలా చదువుతారని, కానీ మీ పథకాల వల్లే మేమంతా చదవుకున్నాం. మేమంతా గర్వంగా ఫీల్ అవుతున్నాం, ఎంతోమంది కుటుంబాలకు మీరు మేలు చేస్తున్నారు, మేమంతా మీకు రుణపడి ఉన్నాం, మీరే ఎల్లప్పుడూ మాకు సీఎంగా ఉండాలని ఏడుకొండలవాడిని వేడుకుంటున్నా అన్నా, థ్యాంక్యూ.నమస్కారం, మా తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ బతుకుతుంటారు, మా వలంటీర్ వచ్చి ఈ పథకం గురించి చెప్పడంతో మా అమ్మా నాన్న చాలా సంతోషపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ ఒక్కరూ కూడా రూపాయి సహాయం చేయరు కానీ మీరు మాత్రం లక్ష రూపాయల సాయం చేస్తున్నారు, చాలా సంతోషం. మా కమ్యూనిటీలో చాలా మంది నిరుపేద కుటుంబాలు ఉన్నాయి, వారందరికీ పిల్లల పెళ్ళిళ్ళు భారంగా మారాయి, మీరు చేస్తున్న సాయం చాలా ఉపయోగకరం.

## ఇస్రో ఖాతాలో మరో విజయం



నెల్లూరు ఇస్రో ఖాతాలో మరో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం నాడు సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈ ఉదయం 9.18 గంటలకు ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వి–డి2 ప్రయోగం విజయవంతమైంది. షార్ లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఎస్ఎస్ఎల్వి–డి2 రాకెట్ ను ప్రయోగించారు. . 2022 ఆగస్టు 7న ఇస్రో ప్రయోగాత్మకంగా నిర్మించి ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వి–డి 1 రాకెట్ సాంకేతిక కారణాలతో విఫలమైని సంగతి తెలిసిందే. అది ఉపగ్రహాల్ని కక్షలోకి ప్రవేశపెట్టలేకపోయింది. తాజాగా లోపాల్ని సరిదిద్ది ఎస్ఎస్ఎల్వి–డి2 రాకెట్ రూపొందించి ప్రయోగించారు. 6.30 గంటలపాటు కౌంట్ డౌన్ కొనసాగిన అనంతరం రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిప్పులు చిమ్ముకుంటు నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్ మూడు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఎస్ఎస్ఎల్వి–డి2 రాకెట్ 334 కిలోల బరువుండే మూడు రాకెట్లతో నింగిలోకి దూసుకెళ్లింది.ఇందులో రెండు దేశీయ ఉపగ్రహాలు కాగా, అమెరికాకు చెందిన ఓ ఉపగ్రహం ఉంది. వీటిని 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ప్రవేశపెట్టింది. తొలి ఉపగ్రహమైన ఈవోఎస్–07ను 785 సెకన్లకు, రెండోదైన జానుస్–1ను 880 సెకన్లకు, చివరిదైన ఆజాదీశాట్ను 900 సెకన్లకు వరుసగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలోని ఈవోఎస్–07 ఉపగ్రహాన్ని ఇస్రో రూపొందించింది. దీని బరువు 156.3 కేజీలు. అలాగే, ఆజాదీశాట్–2 ఉపగ్రహాన్ని చెన్నై స్పేస్కిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు రూపొందించారు. దీని బరువు 8.7 కేజీలు. ఇక, జానుస్–1ను అమెరికాకు చెందిన అంటారిస్ సంస్థ అభివృద్ధి చేసింది. దీని బరువు 11.5 కేజీలు. తక్కువ ఖర్చుతో ప్రపంచ దేశాలుకు సంబంధించిన చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన ఘనత ఇస్రో సాధించినట్లయింది.

## వివేకా హత్య కేసు పరిణామాలపై 'జగనాసుర రక్తచరిత్ర'.. పుస్తకాన్ని విడుదల చేసిన తెదేపా



అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సీఎం జగన్ ప్యాలెస్‌లోనే పథక రచన జరిగిందని తెదేపా ఆరోపించింది. సీబీఐ విచారణలో వేళ్లన్నీ సీఎం దంపతులపైనే చూపిస్తున్నందున ముఖ్యమంత్రి పదవికి జగన్ రాజీనామా చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది.వివేకా హత్య జరిగిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై 'జగనాసుర రక్తచరిత్ర' పేరిట రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యనేతలు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు, నిమ్మల రామానాయుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బొండా ఉమ తదితరులతో కలిసి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విడుదల చేశారు. వివేకా హత్య కేసులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరనే దానిపై వివరాలను పేర్కొంటూ పుస్తకాన్ని రూపొందించారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెదేపా నేతలు మాట్లాడారు. "వివేకా హత్యపై దుష్ప్రచారంతో 2019 ఎన్నికల్లో ఏపీ సీఎం జగన్ లబ్ధి పొందారు. వివేకాను తెదేపా అధినేత చంద్రబాబే హత్య చేయించారని ఎన్నికల సమయంలో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారు. వివేకాది హత్య కాదని... గుండెపోటని చెప్పి.. అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కలిసి హత్యకు సంబంధించిన ఆనవాళ్లు ఏమీ లేకుండా చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో అవినాష్‌రెడ్డి ఆదాయం రూ.18 కోట్లుగా ఉంది. మరి వివేకా హత్యకు సుపారీగా రూ.40 కోట్లు ఇచ్చారంటే.. ఎవరిచ్చారో తెలియాలి కదా?. ఇంత జరుగుతున్నా సీఎం జగన్ ఎందుకు మాట్లాడటం లేదు?. ఈ కేసులోని అంశాలను దృష్టిలో పెట్టుకొని వైకాపా గుర్తింపు రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాస్తాం" అని తెదేపా నేతలు తెలిపారు.


## బీబీసీని నిషేధించాలంటూ పిటిషన్.. తోసిపుచ్చిన సుప్రీం కోర్టు

దిల్లీ: గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ పై కొంతకాలంగా వివాదం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో బీబీసీ కార్యకలాపాలను భారత్‌లో పూర్తిగా నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను భారత సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 'ఓ లఘుచిత్రం దేశాన్ని ఎలా ప్రభావితం చేయగలదు' అని సుప్రీం కోర్టు పిటిషనర్లు హిందూసేన చీఫ్ విష్ణు గుప్తాతోపాటు బీరేంద్ర కుమార్ సింగ్‌ను ప్రశ్నించింది. ఈ పిటిషన్‌ను విచారణకు తిరస్కరించింది.ఈ విషయంపై పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది పింకీ ఆనంద్.. భారత్‌కు, భారత ప్రభుత్వానికి బీబీసీ వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలోనే 'భారత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా' తాజా లఘుచిత్రాన్ని రూపొందించిందని అన్నారు. దీని వెనక ఉన్న కుట్రను బహిర్గతం చేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో దర్యాప్తు జరిపించాలని కోరారు. పిటిషనర్ అభ్యర్థనను విన్న జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం.. దీనిని తప్పుగా భావించారని, ఇది విచారణకు అనర్హమని పేర్కొంది. నిషేధంపై ఆదేశాలు న్యాయస్థానం ఎలా జారీ చేస్తుందని పిటిషనర్‌ను ప్రశ్నించింది.మరోవైపు 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరిట రూపొందిన డాక్యుమెంటరీపై ఆంక్షలను సవాల్ చేస్తూ సీనియర్ పాత్రికేయుడు ఎన్.రామ్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కలిసి వేసిన పిటిషన్‌తో పాటు.. మరో న్యాయవాది ఎం.ఎల్.శర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇటీవలే విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా డాక్యుమెంటరీని అడ్డుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించిన పూర్తి రికార్డులను సమర్పించాలని జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. మూడు వారాల్లో రికార్డులు సమర్పించాలంటూ ఫిబ్రవరి 3న కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.



## రైళ్లలో అత్యవసర మందులతో ఫస్ట్ ఎయిడ్.. విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

న్యూఢిల్లీ: రైలు ప్రయాణీకులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు దేశంలోని అన్ని రైళ్లు, రైల్వే స్టేషన్లలో అత్యవసర మందులు, మెడికల్ సామాగ్రి, ఆక్సిజన్ సిలిండర్ కలిగిన మెడికల్ బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్సీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ అత్యవసర పరిస్థితులలో ప్రయాణీకులకు ఫస్ట్ ఎయిడ్ సేవలు చేసేలా ఫ్రంట్ లైన్ సిబ్బంది అయిన ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ), ట్రైన్ గార్డులు, సూపరింటెండ్లు, స్టేషన్ మాస్టర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.రైళ్లు, రైల్వే స్టేషన్లలో అత్యవసర వైద్య సేవలు కల్పించే అంశాన్ని



పరిశీలించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలకు అణుగుణంగా ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులతో ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. అన్ని ప్రయాణీకుల రైళ్లతో పాటు రైల్వే స్టేషన్లలో అత్యవసర మందులతో కూడిన మెడికల్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని, రైల్వే సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ సేవలు అందించడంలో శిక్షణ ఇవ్వాలని, రైలు ప్రయాణీకులలో ఎవరైనా డాక్టర్ అందుబాటులో ఉంటే వారి చేత లేదా సమీప రైల్వే స్టేషన్‌లో అస్వస్థతకు గురైన ప్రయాణికునికి తక్షణ వైద్య సేవలు అందే సదుపాయం కల్పించాలని నిపుణుల సంఘం సిఫార్సు చేసినట్లు మంత్రి తెలిపారు.ఫస్ట్ ఎయిడ్ సేవలు అందించే రైల్వే సిబ్బందికి ఎప్పటికప్పుడు రిఫ్రెషర్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే రైల్వే స్టేషన్‌కు సమీపాన ఉన్న ఆస్పత్రులు, అక్కడ పని చేసే వైద్యుల, వారి మొబైల్ నంబర్లతో కూడిన జాబితాను రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అస్వస్థతకు గురైన లేదా గాయపడిన ప్రయాణికుడిని ఆస్పత్రికి తరలించేందుకు రైల్వే, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ ఆస్పత్రుల అంబులెన్స్ సర్వీసులను కూడా అందుబాటులో ఉంచినట్లు మంత్రి పేర్కొన్నారు.బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆమోదం లేకుండా బొమ్మలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు శుక్రవారం రాజ్యసభలో వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు వినియోగదారుల వ్యవహారాల సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి చెప్పారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్న బీఐఎస్ మార్క్ లేని బొమ్మలు పిల్లల ఆరోగ్యానికి ఎలాంటి చేటు కలిగిస్తున్నవో ప్రభుత్వం మదింపు చేస్తోందా అన్న ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ బీఐఎస్ ఆమోదం లేకుండా బొమ్మలు తయారు చేస్తున్న వారిపై తరచుగా దాడులు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## 'లోకేష్ యువగళం.. యువగంగాళంలా మారిపోయింది'

అమరావతి: విభజన చట్టానికి చంద్రబాబు వక్రభాష్యం చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ కారుమూరి వెంకటరెడ్డి మండిపడ్డారు.శుక్రవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, శివరామకృష్ణన్, శ్రీకృష్ణ, బూస్టన్ కమిటీలు వికేంద్రీకరణే అవసరమన్నాయన్నారు. రాజధాని నిర్ణయించే అధికారం రాష్ట్రానికే లేదంటున్నాడు చంద్రబాబు. మరి అమరావతిని నిర్ణయించే అధికారం మీకు ఎవరిచ్చారు? అని వెంకటరెడ్డి ప్రశ్నించారు."లోకేష్ యువగళం.. యువగంగాళంలా మారిపోయింది. లోకేష్ పాదయాత్ర కామెడీగా మారింది. లోకేష్ అడ్డదారిలో వచ్చి మంత్రి పదవులు సాధించాడు. మళ్లీ గెలవలేక పారిపోయాడు. పాదయాత్ర అంటే అదొక ఫీలింగ్. పేదలను అక్కున చేర్చుకోవటం, వారి సాధక బాధకాలు అర్థం చేసుకోవాలి. అడ్డదారిలో తిరిగే లోకేష్‌కి అవేమీ తెలియవు. చంద్రబాబు చేసినన్ని బ్రోకర్ పనులు మరెవరూ చేయలేదు" అంటూ వెంకటరెడ్డి దుయ్యబట్టారు.

# 160 వర్సెస్ 175

గుంటూరు, ఫిబ్రవరి 10, ఇదేమిటీ..ఈ లెక్క అనుకుంటున్నారా... టీడీపీ లెక్కలో 160 సీట్లు... వైసీపీలో వై నాట్ 175 అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో ముందస్తు ఎన్నికల గోల ఎక్కువైన విషయం తెలిసిందే. అటు తెలంగాణలో అధికారంలో ఉన్న కేసిఆర్..ఇటు ఏపీలో అధికారంలో ఉన్న జగన్..గడువు కంటే ముందు గానే ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్తారని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. తెలంగాణలో ఎలాగో గతంలో కేసిఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్ళి సక్సెస్ అయ్యారు. ఈ నేపథ్యంలో మరోసారి కేసిఆర్ ముందస్తుకు ప్లాన్ చేస్తున్నారని ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బిజేపిలు..ఖచ్చితంగా కేసిఆర్ ముందస్తుకు వెళ్తారని అంటున్నాయి. కానీ బిఆర్ఎస్ నేతలు మాత్రం ముందస్తుకు వెళ్ళే ఆలోచన లేదని, ఈ సారి షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరూగుతాయని అంటున్నారు.అయితే తెలంగాణలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. అందుకే తెలంగాణ విషయం పక్కన పెడితే..ఏపీలో కూడా ముందస్తు ఎన్నికలపై చర్చ నడుస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ అధికారంలో జగన్ సైతం ప్రభుత్వాన్ని ముందుగానే రద్దు చేసి ముందస్తుకు వెళ్తారని ఇక్కడ ప్రతిపక్ష టిడిపి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంది.ఇప్పటికే జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ఇంకా పూర్తిగా వ్యతిరేకత పెరగక ముందే జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్తారని అంటున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పదే పదే ముందస్తుపై కామెంట్ చేస్తూనే ఉన్నారు.కానీ అధికార వైసీపీ నేతలు మాత్రం ముందస్తుకు వెళ్ళే ఛాన్స్ లేదని, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్తామని అంటున్నారు.అయితే ఎవరి వ్యూహం ఎలా ఉందో ఎవరికి క్లారిటీ లేదు. ముందస్తుపై నిర్ణయం మాత్రం జగన్‌దే..ఆయన వ్యూహం ఎలా ఉందనేది తెలియదు. కానీ టిడిపి మాత్రం ఓ అంచనా వేస్తుంది. ముందస్తు జరుగుతుం దని భావిస్తున్నారు. తాజాగా ఏపీ టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం ముందస్తుపై కామెంట్ చేశారు. రాష్ట్రంలో ఖాయంగా ముందస్తు ఎన్నికలు రాబోతున్నాయని, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కేసుల నుంచి కాసుల దాకా అనేక సమస్యల్లో కూరుకుపోయి ఉన్నారని, అవి తనను ముంచేయక ముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారని చెప్పుకొ చ్చారు.ముందస్తుకు తాము రెడీగా ఉన్నామని, రేపు ఎన్నికలు జరిగినా టీడీపీకి 160 సీట్లు ఖాయమని, జగన్ రెడ్డి మాదిరిగా 175 సీట్లు వస్తాయని అతిశయోక్తులు చెప్పుకోవడం తమకు అలవాటు లేదని అన్నారు. అయితే ముందస్తుపై టిడిపి ధీమాగా ఉంది. కానీ వైసీపీ నుంచి ముందస్తుపై క్లారిటీ లేదు. చూడాలి మరి ఏపీలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయో లేదో.

## వెలుగులు నింపుతున్న ఆర్టీపీపీ

కడప, ఫిబ్రవరి 10, రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) వెలుగులు నింపుతోంది. ప్రధానంగా రాయలసీమ ప్రాంత ప్రజలకు లోఓల్టేజీ సమస్యలను కట్టడి చేస్తోంది. విద్యుత్ కోతలకు ఆస్కారం లేకుండా ఆరు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. 1650 మెగావాట్లు సామర్థ్యానికి గాను 1450 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఏడాదికి పైగా ఇంతటి సామర్థ్యంలో విద్యుత్ ఉత్పత్తి తీయలేదని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి లభిస్తోంది. ఒక్కో యూనిట్ 210 మెగావాట్లు సామర్థ్యంతో 5 యూనిట్లు ఆర్టీపీపీలో నెలకొల్పారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకటి, రెండవ యూనిట్లు నోచుకోగా, 3, 4, 5, 6 యూనిట్లు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూపుదిద్దుకున్నాయి. 6వ యూనిట్ 600 మెగావాట్లు సామర్థ్యంతో నెలకొల్పడంతో మొత్తంగా 1650 మెగావాట్లు విద్యుత్ ఉ త్పత్తికి ఆస్కారం ఏర్పడింది. కాగా 2014?19 టీడీపీ సర్కార్ హయాంలో తీవ్రమైన బొగ్గు కొరత ఏర్పడింది. ఆశించిన మేరకు విద్యుత్ ఉత్పాదన నోచుకోలేదు. ముందుచూపు లేకపోవడంతో టీడీపీ హయాంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నమైందని కార్మికులు వివరిస్తున్నారు. కాగా ఏడాదిగా ఈ స్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయడం ప్రస్తుత ఉత్పత్తే అరుదు అని యంత్రాంగం వివరిస్తోంది. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు దినదినాభివృద్ధి వేగంగా చోటుచేసుకుంది. ఎన్టీ రామారావు హయాంలో అంకురార్పణ చేసి, తొలి యూనిట్‌ను ప్రారంభించి, రెండవ యూనిట్ పనులు కొనసాగించారు.ఆపనులనుచంద్రబాబు సర్కార్ పూర్తి చేయించింది. దివంగత సీఎంవైఎస్ హయాంలో అత్యంత వేగంగా ఒకదాని తర్వాత మరొకటి అన్నట్లుగా 3, 4, 5, 6 యూనిట్లు వేగంగా నిర్మించారు. వెరశి ఆర్టీపీపీకి 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తీసుకవచ్చారు. తద్వారా లో ఓల్టేజీ సమస్యకు చెక్ పడింది. అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలంటే సుమారు రోజుకు 21 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కానున్నట్లు యంత్రాంగం వివరిస్తోంది. టీడీపీ సర్కార్‌లో ఐదేళ్ల కాలంలో తరచూ బొగ్గుకొరతఉత్పన్నంకావడంతోప్రస్తుతంసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ముందు చూపుతో వ్యవహరించింది. ఒకేసారి 6లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీకి చేరాయి. దాంతో బొగ్గు కొరత అనే సమస్యే లేకుండా పోయిందని కార్మికవర్గాలు చెబుతున్నారు. ప్రస్తుతం 42వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీలో సిద్ధంగా ఉన్నాయి.

## గంజాయి రవాణాపై ఉక్కుపాదం

విశాఖపట్నం విశాఖపట్నం నగరంలో గంజాయి అక్రమ రవాణా పైన సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరుసగా దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు బృందాలుగా ఏర్పడిన సెబ్ పోలీసులు వేపగుంట జంక్షన్ నుంచి హనుమంత వాక వరకు సినీ ఫక్కీ లో చేజింగ్ చేసి 150 కేజీ ల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నగరం లోకి భారీగా గంజాయి సరఫరా జరుగుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు సెబ్ అధికారులు వేపగుంట జంక్షన్ వద్ద రూట్ వాచ్ నిర్వహించారు. అధికారులను గమనించిన స్మగ్లర్లు కారును అడవివరం జంక్షన్ మీదుగా హనుమంతవాకకు మళ్ళించారు. మరో సెబ్ అధికారుల బృందం హనుమంతు వాక వద్ద కాపు కాయడంతో గంజాయితో సహా కారును వదిలేసి నిందితుడు పరారయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న విశాఖపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు కారును గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్టు చేయడంతో పాటు నగరంలో గంజాయి అక్రమ రవాణా పూర్తి స్థాయిలో అడ్డుకోవడంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని సెబ్ జాయింట్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు.

# తెలుగువారికి తరిగిపోని మధురామృతం అందించిన గానగంధర్వుడు ఘంటసాల

**-నేడు ఆయన వర్ధంతి**



ఈరోజు ఫిబ్రవరి 11 ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల మనకు పంచిన మధురామృతాన్ని మననం చేసుకుందాం. ఘంటసాల గానం వినగానే తెలుగువారి మది ఆనందసాగరంలో మునకలు వేస్తుంది. ఈ నాటికీ ఘంటసాల పాటతోనే తెలుగునాట ఎన్నో కోవెలలు మేలుకొలుపు పాడుతూ ఉన్నాయి. మాస్టారు గానం చేసిన భక్తిగీతాలు, భగవద్గీత శ్లోకాలు తెలుగువారికి సుపరిచితాలు. ఆ గళంలో జాలువారిన ప్రతీపదం అమృతమయం అవుతుందని తెలుగువారి విశ్వాసం. ఘంటసాల గాత్రం వెలువరించిన గీతాలు ఈ నాటికీ పరవశింప చేస్తూనే ఉన్నాయి... ముఖ్యంగా ఆయన పాడిన భక్తి గీతాలు ఎందరిలోనో ఆధ్యాత్మిక భావం నెలకొల్పుతున్నాయి.ఘంటశాల వెంకటేశ్వరరావు 1922 డిశంబర్ 4న గుడివాడ మండలం చౌటపల్లిలో ఘంటశాల సూర్యనారాయణ, రత్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుండే భజనలు, కీర్తనలు తండ్రి వెంట పాడుతూ ఉండేవారు. తండ్రి ఆశయం నెరవేర్చాలనే లక్ష్యంతో సంగీత గురుకులంలో చేరారు. అక్కడి కట్టుబాట్లను తట్టుకోలేక తిరిగి సొంత ఊరికి వచ్చేశారు. తెలిసిన కొందరు సంగీత విద్వాంసుల ఇళ్ళలో పని చేస్తూ సంగీతం అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పని ఒత్తిడి పెరగడంతో ఆయన సంగీత కళాశాలలో చేరాలని అనుకున్నారు. 40 రూపాయలు విలువ చేసే ఉంగరాన్ని కేవలం రూ.8రూపాయలకు అమ్మి ఆంధ్రలో ఏకైక సంగీత కళాశాలలో చేరారు. అక్కడ ఉంటూ రోజుకు ఒక్కపూట భోజనం చేస్తూ అద్దె కట్టేందుకు డబ్బు లేక ఆ ఊళ్ళో ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో తలదాచుకునేవారు. తరచూ ఆ గుడికి వచ్చే పట్రాయని సీతారామశాస్త్రి ఘంటశాల గురించి తెలుసుకుని తన ఇంట ఉచితంగా సంగీత శిక్షణనివ్వడానికి అంగీకరించారు. శాస్త్రి చాలా పేదవారు కావడంతో భోజన వసతి కల్పించడానికి చాలా ఇబ్బందులు పడేవారు.1942లో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాలు అలీపూర్ జైల్లో జైలు శిక్ష అనుభవించారు. 1944 మార్చి4న సావిత్రమ్మతో పెళ్ళి జరిగింది. తన పెళ్ళిలో తనే కచేరి చేసి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు ఘంటసాల. ఘంటశాలలోని గాన సామర్థ్యాన్ని గుర్తించిన సముద్రాల నాటి మద్రాసులోని రేణుకా ఫిలింస్కు తీసుకువెళ్ళి చిత్తూరు నాగయ్య, బి.ఎన్ రెడ్డిలకు ఎదుట పాటకచ్చేరీ చేయించారు. తరువాత ఘంటశాల తన మకాంను పానగల్ పార్కు వాచ్మెన్కు నెలకు రూ.2/-లు ఇచ్చే ఒప్పందం చేసుకుని అక్కడకు మార్చారు. పగలంతా అవకాశాల కోసం వెతికి రాత్రికి పార్కులో నిద్రించేవారు. చివరికి సముద్రాల అప్పటి మద్రాసు రేడియో కేంద్రంలో లలిత గీతాల గాయకుడి అవకాశాన్ని ఇప్పించారు. పాటలు పాడుతూ సినీరంగంలో చిన్న చిన్న వేషాలు వేసేవారు.1947లో లక్ష్మమ్మ చిత్రానికి సంగీత దర్శకునిగా మారారు. 100 సినిమాలకు పైగా సంగీత దర్శకత్వం వహించారు. కొన్ని చిత్రాలకు నిర్మాతగా కూడా వ్యవహించారు. 1969-72 మధ్యకాలంలో తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన గాయకునిగా కొనసాగారు. 1970లో ఆయనకు పద్మశ్రీ అవార్డు లభించింది. 1969 నుంచి తరచూ ఘంటశాల అనారోగ్యానికి గురయ్యేవారు. 1971లో ఐరోపా, ఆమెరికాలో ప్రదర్శనలు ఇస్తున్న సమయంలో ఘంటశాలకు గుండెనొప్పి వచ్చింది. హుటాహుటీన అక్కడి ఆసుపత్రికి తరలించారు. అప్పుడే ఆయనకు భగవద్గీత పాడాలనే కోరిక కలిగింది. భగవద్గీత పూర్తి చేసి సినిమా పాటలు పాడుకూడదని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత 1972లో భక్త తుకారాం, జీవన తరంగాలు, దేవుడు చేసిన మనుషులు వంటి హిట్ చిత్రాలకు పాటలు పాడారు. 1972లో రవీంద్రభారతిలో ప్రదర్శన ఇస్తున్నపుడు గుండెనొప్పి అనిపించడంతో హాస్పిటల్లో చేరాడు. అప్పటికే మధుమేహంతో బాధపడుతూ ఉన్నారు. చాలారోజులు చికిత్స అనంతరం హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయ్యారు. అప్పుడే ఆయనకు భగవద్గీత పాడాలన్న కోరిక కలిగింది. భగవద్గీత పూర్తిచేసిన తర్వాత సినిమా పాటలు పాడకూడదు అనుకున్నారు. 1974 నాటికి అతను ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. చివరికి 1974 ఫిబ్రవరి 11న ఆస్పత్రిలో కన్నుమూసారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

**కోవిడ్ నిబంధనలను తప్పక పాటించాలి**

**కలెక్టర్ వి.విజయ్ రామరాజుళ**

కడప ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని బోర్డ్ రూమ్ నుండి కేంద్ర ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై.. జేసీ సాయి కాంత్ వర్మ, , డిఆర్వో గంగాధర్ గౌడ్ ,జిల్లా అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు వీసీ ద్వారా ఆర్డీఓ, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో జిల్లాలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుతం జరిగే.. ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరూ తప్పకుండా శిక్షణకు హాజరుకావా లన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ సిబ్బందిని.. వారి సొంత మండలంలో కానీ, వారు విధులు నిర్వహించే మండలానికి కానీ.. ఎన్నికల విధులు కేటాయించకూడ దన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు.. భద్రతగా ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, నార్మల్ సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు, తదితర ప్రాంతాలవద్ద నియమ నిబంధనల మేరకు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సూచనల మేరకు.. కోవిడ్ -19 ప్రోటోకాల్ ను పాటించాలన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ నియమావళిని తూచా తప్పక అందరూ పాటించాలన్నారు ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించాలన్నారు. ర్యాండమైజేషన్. పద్ధతి ద్వారా.. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులను కేటాయించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ.. గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జరగబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులందరికి కేటాయించిన విధులను తప్పక పాటించాల న్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి న ఓటర్ల జాబితాలో డూప్లికేషన్, అర్హత లేని వారుంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫోటోలను తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నేటి నుండి అమలులో ఉంటుందని ప్రభుత్వ అధికారులందరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డ్వామా పిడీ యదుభూషన్ రెడ్డి, డిఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ , డిటిసి మీరా ప్రసాద్,డిఎంహెచ్ఓ డా.నాగరాజు,సిపిఓ వెంకటరావు, ఎన్ఐసి డిఐఓ విజయకుమార్, డిసిఓ సుభాషిణి, జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి,సర్వ శిక్ష అభియాన్ పిఓఎస్ ఎస్ ప్రభాకర్ రెడ్డి,మెప్మా పిడి రామ్మోహన్ రెడ్డి, నోడల్ అధికారులు, పోలీస్ అధికారులు, కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల సూపర్ ఇంటెండెంట్లు,డివిజన్ కేంద్రాల నుండి ఆర్డీవోలు, తహశీల్దార్లు తదితరులు హాజరయ్యారు

# సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రజా పక్షాన నిరసన గళం వినిపిస్తా

**-రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**

నెల్లూరు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రజల పక్షాన నిరసన గళం వినిపిస్తానని నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు . స్థానిక కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ సెంటర్లో ఉన్న రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఉన్నంతకాలం అధికారం అనుభవించి చివర్లో బయటకి వెళ్లడం నాకు ఇష్టం లేదన్నారు. అందుకే ముందుగానే అధికార పక్షానికి దూరంగా నిలబడ్డా ఉన్నానని తెలియజేశారు.అధికార ప్రభుత్వానికి నాకు ఏర్పడిన అంతర్మోదనాల నేపథ్యంలో నాకు అండగా నిలిస్తే కష్టాలు తెచ్చుకున్నట్లే అని అన్నారు. ఈ విషయం స్పష్టంగా తెలిసి కూడా నా వెంట అనేక మంది నిలుస్తున్నారని తెలిపారు. వైకాపా అధిష్టానం, పార్టీ మంత్రులు ,ఎమ్మెల్యేలు కావాలని కలగజేస్తున్న బెదిరింపులు, కష్టాలు ఎదుర్కొని నా వెనుక నిలిచిన వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జెడ్పి కో ఆప్షన్ సభ్యులు అండగా నిలిచారని వారందరికీ తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు.నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రజాపక్షాన నిరసన గళం వినిపిస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.టీడీపీలో గెలిచి వైసీపీలోకి వచ్చిన ఎమ్మెల్యేల చేత స్పీకర్ ఫార్మాట్ లో రాజీనామా చేపించిన తర్వాత మాత్రమే, నా రాజీనామా అడగండని పార్టీ అధిష్టాన పెద్దలకు సూచించారు. దీన్ని స్పీకర్ ఆమోదించి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికలకు సిద్దమని ఎలక్షన్ కమిషన్ కి పంపండి. అప్పుడు స్పందిస్తాననని డిమాండ్ చేశారు.భవిష్యత్ లో ఎలాంటి సమీక్షా సమావేశాలు పెట్టినా, మమ్మల్ని పిలిచినా పిలవకున్నా నేను, మేయర్ సమావేశానికి వెళ్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.ఇరుకళల అమ్మవారి జాతర చేస్తానని, అందుకు అవసరమైన అనుమతి కోసం దేవాదాయ శాఖకు లేఖ రాస్తాన అని ఈ సందర్భంగా తెలియజేశారు.ఇందులో రాజకీయం చేస్తే అప్పుడు తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకుంటానని సందర్భంగా తెలిపారు.

## "ఆపరేషన్ స్వేచ్ఛ"వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం పోస్టర్

**ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్**

నంద్యాల ఫిబ్రవరి 10 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 9 ని వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం గా ప్రకటించింది దీనిని పురస్కరించుకొని, 'ఆపరేషన్ స్వేచ్ఛ" అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ఫిబ్రవరి 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు వెట్టి చాకిరి నిర్మూలన వారోత్సవాలుగా నిర్వహించడం జరుగుతుంది. కావున ఎక్కడైనా ఎవరితోనైనా వెట్టి చాకిరి చేయించుకున్నట్లయితే వారు చట్టపరంగా శిక్షార్హులు అందుకు సంబంధించిన పోస్టర్లు "నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్"ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ, సహాయ కార్మిక కమిషనర్ నంద్యాల బషీరున్నీసా బేగం, సహాయ కార్మిక అధికారులు ఏ. ఎం.డి సమీర్, బి మురళీకృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలవరం ఆలస్యానికి టీడీపే కారణం

ఏలూరు గత ప్రభుత్వం తొందరపాటుతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో జరుగుతున్న పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నిపుణుల ఇచ్చిన రిపోర్ట్ అనంతరం డయాఫ్రమ్ వాల్ కొత్తది నిర్మాణం చేయాలా లేక పాతది కొనసాగించాల అనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇదికీలక పరిణామం. కాఫర్ డ్యామ్ లు పూర్తి చేసిన తర్వాత డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేయాలి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రాజెక్టు నిర్మాణం మరింత ఆలస్యం అవుతుందన్నారు. 41.17 కాంటూరు పరిధి వరకు ఆర్.అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తి చేయడం జరుగుతుందని.. ప్రతి విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సిందేనన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి

విశాఖపట్నం విశాఖలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెంకోజిపాలెం కూడలి దగ్గర బైక్‌పై వెళుతున్న ముగ్గురు యువకుల్ని ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హనుమంతు వాక నుంచి మద్దిలపాలెం వైపు వెళుతున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.అర్థరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని.. మృతదేహాలు కేజీహెచ్ కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు సాయి, దుర్గా ప్రసాద్, గోపీలుగా గుర్తించారు. పోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతంలో సీసీ ఫుటేజ్ ఆధారంగా బైక్‌ను ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించే పనిలో ఉన్నారు.

## కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత

అనంతపురం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం టీ సర్కిల్‌లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు కనిపించాయి. ఏపీ మంత్రి ఉషాశ్రీ చరణ్ భూముల వ్యవహారంపై చర్చకు రావాలని టీడీపీ సవాల్ చేసింది.. ఈ క్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరితో పాటూ కుమారుడు మారుతి చౌదరి టీ సర్కిల్ దగ్గరకు బయల్దేరారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకోగా.. వారి నుంచి తప్పించుకుని మారుతి చౌదరి టీ సర్కిల్ దగ్గరకు చేరుకున్నారు.మంత్రి ఉ షాశ్రీ భూములకు సంబంధించిన ఆధారాలు మీడియాకు చూపుతుండగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, టీడీపీ నేతలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి ఉ ద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు టీడీపీ కార్యకర్తలతో పాటూ మరికొందర్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## వారిద్దరిదీ అపవిత్ర పొత్తు

ఏలూరు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ మధ్య ఉన్నది అపవిత్ర పొత్తు అన్నారు మంత్రి కొట్టు సత్యన్నారాయణ. పవన్ బీజేపీని పెళ్లి చేసుకుని టీడీపీతో కాపురం చేస్తానని అంటున్నారని, ఆ పని చేసి కాపుల పరువు తీయొద్దని చెబుతున్నామని అన్నారు. పవన్ వ్యవహారశైలి చూసి .. ఆయన్ను ఎవరికైనా చూపించడ్రా అంటూ జనం సినిమా డైలాగులు చెబుతున్నారని అన్నారు. జగన్ మళ్లీ సీఎం కాకుండా అడ్డుకోవడం చంద్రబాబు, పవన్ వల్ల కాదని మంత్రి తెగేసి చెప్పారు.

## తల్లిదండ్రులను విస్మరించేవారు శిక్షార్హులే

**సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్**

కోరుట్ల,వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ అన్నారు. గురువారం కోరుట్ల పట్టణములో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కౌన్సెలింగ్ కేంద్రం లో కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులకు వయోవృద్ధుల సంరక్షణ చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో కోరుట్ల కు చెందిన ప్రముఖ రక్త దాత కటకం గణేష్ ను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ సీనియర్ సిటీజన్స్ అవగాహన పుస్తకాలు ఆవిష్కరించారు. అనంతరం హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ చట్టం సెక్షన్ 24 ప్రకారం వయోవృ ద్ధులైన తల్లిదండ్రులను వేధింపులకు,నిరాదరణకు గురిచేసిన కొడుకుల కు,వారసులకు మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అధికారం ట్రిబ్యునల్ చైర్మన్లు అయిన రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఉందన్నారు.కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ లలో ఆర్డీవో వినోద్ కుమార్ వయోవృద్ధుల కేసుల పరిష్కారం లో రాష్ట్రంలోనే నెంబర్ వన్ అధికారిగా నిలిచారన్నారు. జిల్లా కేంద్రంలోసీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా హామీ ఇచ్చారన్నారు.కోరుట్ల డివిజన్ లో ప్రభుత్వం నియమించిన రాజీ అధికారులు పబ్బా శివానందం,గంటేది రాజ్ మోహన్,నల్ల లక్ష్మీ నారాయణ లు వయోవృద్ధుల కేసుల రాజీ లో చేస్తున్న కౌన్సిలింగ్ ల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా రాష్ట్ర హోమ్ మినిస్టర్ మహమూద్ అలీ చేతుల మీదుగా ఇటీవల జరిగిన రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆవిర్భావ సదస్సులో ఉత్తమ రాజీ అధికారులుగా అవార్డులు పొందడం ను అభినందించారు. కేంద్రంలో ప్రభుత్వం తరపున వృద్ధాశ్రమ ఏర్పాటు కు మం కృషి చేసిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుకు,కోటి నిధులు మంజూరు చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్ కు కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వయోవృద్ధుల చట్టం లో చేసిన సవరణలు సీనియర్ సిటిజన్స్ కు భరోసా నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సి.హన్మంత రెడ్డి,సీనియర్ సిటిజన్స్ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్,కోశాధికారినల్లలక్ష్మీనారాయణ,ఉ పాధ్యాక్షుడు ఎం.డి.సైఫోద్దిన్,మెట్ పల్లి అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి,కార్యదర్శి సౌడాల కమలాకర్, రాజయ్య,సాజిద్ అలీ,గంగారాం,అనసూయ,లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ కు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

విశాఖపట్నం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపె ట్టిన బడ్జెట్ తో ఏపీ కి అన్యాయం జరిగిందని, ఉత్తరాంధ్ర ,విశాఖ రైల్వే జోన్ కి నిధులు కేటాయింపులోనూ వివక్ష చూపించారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి ఆరోపించారు.కేంద్రబడ్జెట్లో ఉ త్తరాంధ్ర జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ రైల్వే డిఆర్ఎం కార్యాల యం వద్ద సీపీఐ నిరసన చేపట్టింది.ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట నిర్మాణం పూర్తి చేయడానికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదని, ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో విశాఖ కేంద్రంగా ప్రత్యేక జోన్ ఏర్పాటు కానుందని ఓఎస్డీ ని సైతం నియమించి డి పి ఆర్ ఇచ్చి నేటికి రెండు సంవ త్సరాలు గడిచినా దాని అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లను సమాయత్తం చేయండి

బద్వేలు వచ్చే మార్చి 13వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటినుంచి ఓటర్లను సమాయత్తం చేసి వారిని చైతన్య వంతులను చేయాలని బద్వేలు తెలుగుదేశం నాయకులు పిలుపునిచ్చారు ఈ మేరకు శుక్రవారం బద్వేల్ మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి గ్రామీణ అధ్యక్షుడు రవి కుమార్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు వడ్లపూడి నాగభూషణం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సమ్మెట అబ్రహాం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు గత నాలుగు సంవత్సరాల వైకాపా పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడింది ఓటర్లకు తెలియ చెప్పవలసిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి ఓటర్లు గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చారు వైకాపా పై ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించి పాలనప్పగిస్తే గత నాలుగు సంవత్సరాలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చుక్కలు చూపించారని వారు ఆరోపించారు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని వారు తెలిపారు జగన్మోహన్ రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత రాజధాని అమరావతి నీ అన్ని విధాలుగా భ్రష్టు పట్టించారని ఆరోపించారు దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా మన రాష్ట్రానికి మూడు రాజధానులు అంటూ ప్రజలను అయోమయంలోకి నెట్టి వేశారని వారు పేర్కొన్నారు ఒక సైకో ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో జగన్మోహన్ రెడ్డి నీ చూసి నేర్చుకోవాలని వారన్నారు రెండు రోజుల క్రితమే కేంద్రం అమరావతి మాత్రమే రాజధాని అని స్పష్టంగా చెప్పిందని ఇది ముఖ్యమంత్రికి చెంపపెట్టు అని వారన్నారు ఈనెల 23వ తేదీ సుప్రీంకోర్టులో జరిగేది కూడా ఇదేనని వారి పేర్కొన్నారు సుప్రీంకోర్టులో రాజధాని వ్యవహారం ఉన్నందున ఎక్కువగా మాట్లాడకూడదని వారు

**ఓటర్లలో చైతన్యం తీసుకురండి**
**తెలుగుదేశం అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేయండి**
**నాయకులకు కార్యకర్తలకు బద్వేలు తెలుగుదేశం నాయకుల పిలుపు**

పేర్కొన్నారు జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పనులతో ప్రజలకు పిచ్చి పట్టిస్తున్నారని పరారోపించారు జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షగా నేతగా ఉన్నప్పుడు జరిపిన పాదయాత్రలో ఎక్కడలేని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదని వారు ఆరోపించారు ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం ఒకటో తేదీ వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆరోపించారు ప్రభుత్వ ఖజానా ఎప్పుడో ఖాళీ అయిందని అప్పులు కూడా పుట్టే పరిస్థితులు లేవన్నారు వైకాపా ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులు వివిధ వర్గాల ప్రజలు అన్ని కులాల వారు మతాలవారు తీవ్రమైన కోపంతో ఉన్నారని వారు పేర్కొన్నారు రాష్ట్రం అధోగతి పాలు కావడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతకాని తనమే కారణమని ఆరోపించారు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు జగన్ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు పాదయాత్ర విజయవంతం జరుగుతున్నడంతో పాదయాత్ర పై వైకాపా నాయకులు పసలేని ఆరోపణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వారన్నారు పాదయాత్ర సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వారు సూటిగా ప్రశ్నించారు

### 13 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించాలి

**పాత్రికేయులు డిమాండ్**

కౌతళం గ్రామ పంచాయితీ (((గ్రామ కంఠం) పరిధిలో ఉన్న 13 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, గ్రంథాలయాలు కు వినియోగించాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రక్కన ఖాళీ స్థలాన్ని 13 సెంట్లు కబ్జాలకు గురికాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని మండల విలేకరులు సమావేశం ఏర్పాటు చేసి మండల తహసిల్దార్, ఎంపీడీఓ లకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 13 సేంట్లు స్థలం కబ్జా అయినది ప్రజలు వాపతున్నారు. మిరు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు , గ్రంథాలయం లకు వినియోగించాలనీ కోరారు. లేనియెడల ఈ స్థలాన్ని ఇతరులకు గురికాకుండా చూసుకోవాలని కోరుచున్నాము. మండల అధికారులు ఈ విషయంపై స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నాము లేనియెడల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నామని మండల విలేకరులు హెచ్చరించడం అయినది. ఆనంతరం ఎంపీడీవో జగన్ మోహన్ రెడ్డి కు తహసిల్దార్ రమేష్ రెడ్డికు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ముక్తర్ భాష, మొహమ్మద్, ఉమేష్ ,అంజి, విజయ్, గోపాల్ ,రామచంద్ర, గొట్టయ్య, ఆరిఫ్, సునీల్, మంజూ, శివ, శరణ,రమేష్, రాముడు తదితులున్నారు.

# కేంద్ర బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి మొండి చేయి



నంద్యాల :-కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం చేసిన, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీ కరణ చేస్తూ, దేశ సంపదను బడా పారిశ్రామికవేత్తలు.అంబానీ, ఆదానిలకు దోచిపెడుతున్నటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా. ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న ఆదాని ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నంద్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనివాస సెంటర్ నుండి ర్యాలీగా బయలుదేరి ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి సోమన్న అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటారాముడు. ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు గారు మాట్లాడుతూ. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వము రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నదని ప్రత్యేక హోదా

**- - - . సిపిఐ నాయకులు నిరసన.**

రాయలసీమ. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని చెప్పి అవేవీ పట్టించుకోకుండా పక్క రాష్ట్రంలో కర్ణాటకకు తిరిగి రానున్న ఎన్నికలలో అధికారంలో కి వచ్చేందుకు రాయలసీమకు నష్టం జరిగే నటువంటి అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కు 5300 కోట్ల నిధులను కేటాయించడం దుర్మార్గమని ఇవన్నీ తెలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్టు ఉంటూ అంబానీ ఆదానులకు ఊడిగం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ రాష్ట్రంలో వస్తున్న పరిశ్రమలకు అదాని కంపెనీలకు తిరిగి ఇవ్వడం అనేది దుర్మార్గమని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అదాని లాంటి కార్పొరేటర్ శక్తులకు ప్రైవేటీకరణ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ రానున్న ఎన్నికలలో తిరిగి అధికారంలో వచ్చేందుకు దొడ్డి దారిన పరి పాలన చేస్తున్నది. విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడు ఎఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు ఎఐ వైయస్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు సిపిఐ నాయకులు. మధు భాష. కరిముల్లా. కలాము. భాస్కర్ రెడ్డి. మహిళా నాయకురాలు లక్ష్మీదేవి. సుగుణమ్మ. ఎఐ ఎస్ ప్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేషు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్.ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి.మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అబ్బి పురం గ్రామ గిరిజనలను ఐటిడిఏ లో చేర్చాలి


**మహానంది . సిపిఐ. నాయకులు**

నంద్యాల :-మహానంది మండలం అబ్బిపురం గ్రామ గిరిజనులను ఐటీడీఏ లో చేర్చి. మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం నాడు మహానంది కి వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కూమ్ము.రవి బాబుకు డిమాండ్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటా. రాముడు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఆర్.సామేలు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య నంద్యాల డివిజన్ అధ్యక్షుడు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు .ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి.మోటా రాముడు మాట్లాడుతూ. మహానంది మండలంలో అబ్బీ పురం గ్రామంలో దాదాపు 42 గిరిజన కుటుంబాలు 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో పూరి గుడిసెలు వేసుకొని నివాసం చేస్తున్నారని వారికి సిపిఐ ఆధ్వర్యంలో అనేక ఆందోళన ఫలితంగా నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వడం జరిగిందని కానీ వారు నివసిస్తున్న కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించారని అన్నారు.. శ్రీశైలం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి గారికి గడపగడప కార్యక్రమానికి ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు గిరిజన కాలనీ ని ఐటిడిఎలో చేర్చాలని విన్నవించుకోవడం జరిగిందన్నారు. ఆ కాలనీలో వీధిలైట్లు మురికి కాలువలు. రోడ్డు నిర్మాణం. మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేపట్టాలని చెప్పినా గానీ నేటి వరకు కూడా అమలు కాకపోవడం విచారకరమని అన్నారు.

# హమారా ప్రసాదు పై దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ హితవు

ఎమ్మిగనూరు పట్టణంలోని ఫిబ్రవరి 10 శుక్రవారం నాడు నియోజకవర్గం జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు ఉమ్మడి జిల్లా ఉప కార్యాలయం లో జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాదిగ ఆధ్వర్యంలో నేడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ, ఇటీవల అమరా ప్రసాద్ అనే వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటోను పట్టుకొని ఫోటో మీద దేవుని పేర్లు వ్రాసుకొని అసభ్యంగా మాట్లాడుతూ అంబేద్కర్ బతికినప్పుడు అమర ప్రసాద్ బ్రతికే ఉండుంటే గాంధీజీ గారిని గాడ్సే ఎలా చంపాడో,అంబేద్కర్ గారిని అలానే చంపుతానని మాట్లాడిన మాటలు వాట్సాప్ ఫేస్బుక్ లో వైరల్ అవుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడాడు. అమర ప్రసాద్ మాట్లాడిన మాటలకు ఇంతవరకు దేశంలోన రాజకీయ పార్టీలు, ఉద్యోగస్తులు,కుల సంఘాలు,స్వచ్ఛంద సేవ సంస్థలు, అంబేద్కర్ రిస్టులు ఖండించలేకపోవడం భారత దేశానికి సిగ్గుచేటు. అంబేద్కర్ అందరూ సమానంగా ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ రచించడం జరిగింది. ఇది తెలియని హమారా ప్రసాదు కులంకారముతో ఆర్ఎస్ఎస్ ప్రభావంతోన, కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదిగా మారుతున్నాడు. ఈ విధంగా అపర మేధావి, ప్రపంచ జ్ఞాని, ప్రపంచ వేగుచుక్క డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అసభ్య పదజాలంతో మాట్లాడిన అమర ప్రసాద్ పై దేశద్రోహం కింద కేసు నమోదు చేసి ఉరితీయాలని దుయ్యబట్టారు. అదేవిధంగా అంబేద్కర్ ఫోటోలు పెట్టుకొని సంఘాలుగా ఏర్పాటు చేసుకొని పబ్బం గడుపుతున్న ఉద్యమకారులారా ఇప్పటికైనా మేల్కొని చేయి చేయి కలిపి ఉద్యమాలకు నడుం బిగించాలని మాట్లాడి, రాబోయే రోజుల్లో అమర ప్రసాద్ ను అరెస్ట్ చేయలేకపోతే గల్లి నుంచి ఢిల్లీ వరకు జై భీమ్ ఎమ్మార్పీఎస్ నుండి రాస్తారోకాలు, ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు తో ఉధృతం చేస్తామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల అధ్యక్షుడు శావాలా బుజ్జిబాబు నందవరం మండల ఇన్చార్జి చింపిరి చిన్న పోతప్ప మరియు నాయకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# అల్లరి నరేష్ ఉగ్రం.. సర్ ప్రైజ్ రెడీ!



ఒకప్పుడు కామెడీ హీరోగా పేరు తెచ్చుకున్న అల్లరి నరేష్... ఈ మధ్య ట్రెండు మార్చి సిరియస్ సినిమాల్లో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఆయన నటించిన నాంది సూపర్ హిట్ కాగా ఆ తర్వాత నటించిన ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ఇప్పటికే ఓటీటీలో కూడా సందడి చేస్తోంది.అయితే అల్లరి నరేష్ నాంది లాంటి బ్లాక్ బస్టర్ హిట్ ను తనకు అందించిన దర్శకుడు విజయ్ తో కలిసి మరో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పేరే ఉగ్రం. గతంలో వీరి కాంబినేషన్లో తెరకెక్కిన నాంది సినిమా సూపర్ హిట్ కావడంతో వీరిద్దరి కాంబినేషన్ మీద ప్రేక్షకులలో అంచనాలు ఏర్పడ్డాయి.ఇక ఉగ్రం పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాకి సంబంధించిన రిలీజ్ డేట్ కూడా ఇప్పటికే ప్రకటించారు. ఉగ్రం సినిమా ఏప్రిల్ 14వ తేదీన రిలీజ్ చేసేందుకు సినిమా యూనిట్స్ సిద్ధమవుతుండగా ఇప్పటికే ఈ సినిమా యూనిట్ అధికారిక ప్రకటన కూడా చేశారు.ఇక తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ సినిమా టీజర్ అప్డేట్ కూడా వచ్చేసింది. ఈ సినిమా టీజర్ ని శివరాత్రి సందర్భంగా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఫిబ్రవరి 18వ తేదీన శివరాత్రి రానుండగా అదే రోజు టీజర్ రిలీజ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇక ఈ సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్ గా దర్శన నటిస్తుండగా శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందిస్తున్నారు.సాహు గారపాటి హరీష్ పెద్ది కలిసి ఈ సినిమాని షైన్ స్క్రీన్స్ బ్యానర్ మీద ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు ఖచ్చితంగా మొదటి సినిమా వీరిద్దరి కాంబినేషన్లో సూపర్ హిట్ కావడంతో రెండవ సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని అంచనాలు ఉన్నాయి.అయితే గతంలో కన్నడలో తెరకెక్కిన ఉగ్రం సినిమాకి ఈ సినిమా రీమేక్ అనే ప్రచారం జరుగుతూ ఉండగా ఆ విషయం మీద మాత్రం ఇప్పటివరకు అధికారిక క్లారిటీ అయితే లేదు. ఒకసారి ప్రమోషన్స్ ప్రారంభించిన తర్వాత క్లారిటీ వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.


# కళ్యాణ్ రామ్ అమిగోస్ బాక్సాఫీస్ టార్గెట్ ఎంతంటే?



నందమూరి హీరో కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కిన సినిమా అమిగోస్. ఆషికా రంగనాథ్ కథానాయిక. కళ్యాణ్రామ్ త్రిపాత్రాభినయం చేస్తుండటంతో ప్రచార చిత్రం నుంచే ఆసక్తి కలిగించిన ఈ సినిమా ఫిబ్రవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. రాజేంద్ర రెడ్డి దర్శకుడిగా వ్యవహించారు.అయితే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 742కు పైగా థియేటర్లలో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. నైజాంలో 152 సీడెడ్లో 60 ఆంధ్రలో 210కు పైగా హాళ్లలో సందడి చేయనున్నట్లు సమాచారం. మొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఏపీ తెలంగాణాలో 425కు పైగా థియేట్లరలో ప్రేక్షకులను అలరించనున్నాయి సినీ వర్గాలు అంటున్నాయి.ఇకపోతే కర్ణాటక ప్లస్ రెస్ట్ ఆఫ్ ఇండియాలో 60కు స్క్రీన్లలో ఓవర్సీస్లో 260కుపైగా హాళ్లలో సందడి చేయనున్నట్లు లెక్క తెలుస్తోంది. అలా మొత్తంగా వరల్డ్వైడ్గా 742కు పైగా సంఖ్య ఉంటుందని సమాచారం. ఇంకా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 11.30కోట్లకు పైగా బిజినెస్ అయిందట. అంటే ఈ మూవీ బ్రేక్ ఈవెన్ రూ.12కోట్లు అన మాట.బింబిసార లాంటి హిట్ తర్వాత కళ్యాణ్ రామ్ ఈ అమిగోస్ చిత్రం చేయడంతో సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. ఆషికా రంగనాథ్ కథానాయిక. ఇందులో బాలకృష్ణ నటించిన ధర్మక్షేత్రంలోని ఎన్నో రాత్రులొస్తాయి గాని పాటను రీమిక్స్ చేయడం విశేషం.ఈ పాటను ఇళయరాజా స్వరపరచగా.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్ర సంయుక్తంగా ఆలపించారు. ఇప్పుడీ గీతాన్ని జిబ్రాన్ సరికొత్తగా రీమిక్స్ చేశారు. ఇకపోతే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఒకే పోలికలతో ఉన్న ముగ్గురు వ్యక్తుల కథగా రూపొందిన చిత్రమిది. కళ్యాణ్రామ్ ఇందులో మంజునాథ్ సిద్ధార్థ్ మైఖేల్ అనే మూడు పాత్రల్లో సందడి చేశారు. వీటిలో మైఖేల్ పాత్రను ప్రతినాయక ఛాయలున్న పాత్రలా ప్రచార చిత్రంలో చూపించారు. అందులో కళ్యాణ్రామ్ ఆహార్యం.. ఆయన పలికించిన హావభావాలు చేసిన యాక్షన్ హంగామా ఆసక్తి రేకెత్తించాయి. మరి అతనికి.. మంజునాథ్ సిద్ధార్థ్ పాత్రలకు మధ్య సాగే పిల్లి ఎలుకా ఆట ఏంటనేది తెరపై చూసి తెలుసుకోవాలి.

# ధనుష్ కి వున్న ఏకైక అస్త్రం అదేనా?

కొన్ని సినిమాలు ఎలా వున్నా సరే ఫెస్టివెల్ సీజన్ హీరో స్టార్ డమ్ కారణాల వల్ల కంటెంట్ లేకపోయినా సరే గండం నుంచి గట్టెక్కుతాయి. అయితే కొన్నిమాత్రం కంటెంట్ ని ప్రధాన బలంగా చేసుకుని ఎలాంటి సీజన్ లేకపోయినా ప్రేక్షకుల అండతో నెగ్గేస్తుంటాయి. ఇటీవల సంక్రాంతి బరిలో నిలిచిన దళపతి విజయ్ 'వారీసు' తెలుగులో 'వారసుడు'గా విడుదలై ఆశించిన విజయాన్ని దక్కించుకోలేకపోయింది. అలా అని నష్టాలని అందించలేదు. తమిళ వెర్షన్ మాత్రం బ్లాక్ బస్టర్ స్థాయి వసూళ్లని రాబట్టింది.దీనికి దళపతి విజయ్ స్టార్ డమ్ పొంగల్ ఫెస్టివెల్ సీజన్ ప్రధాన అడ్వాంటేజీగా నిలిచి 'వారీసు'ని



విజేతీరాలకు చేర్చాయి. నిర్మాతని భారీ నష్టాల నుంచి సేఫ్ గా గట్టెక్కించాయి. ఈ మూవీని తెలుగు నిర్మాత దిల్ రాజు నిర్మించగా తెలుగు దర్శకుడు వంశీ పైడిపల్లి రూపొందించాడు.సేమ్ ఇదే తరహాలో మరో తమిళ హీరో ధనుష్ తెలుగు టీమ్ తో తొలి సారి చేసిన మూవీ 'సార్'. సితార ఎంటర్ టైన్ మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ శ్రీకర స్టూడియోస్ బ్యానర్ లపై సూర్యదేవర నాగవంశీ సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు.తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన ఈ మూవీని ఫిబ్రవరి 17న తమిళ తెలుగు భాషల్లో ఏక కాలంలో రిలీజ్ చేస్తున్నారు. ఈ మూవీకి వున్న ఏకైక అడ్వాంటేజ్ కంటెంట్ మాత్రమే. తమిళంలో ధనుష్ కు మంచి క్రేజ్ వున్నా తెలుగులో ఆ స్థాయి క్రేజ్ లేదు. సో తెలుగు వరకు మాత్రం కంటెంట్ పై ఆధారపడాల్సిందే. పండగ సీజన్ కాకపోవడంతో అందరి దృష్టి ఈ మూవీపై పడింది. ఎలాంటి అడ్వాంటేజ్ లేకుండా ఈ మూవీతో ధనుష్ తెలుగు తమిళ భాషల్లో ఎలా గట్టెక్కుతాడా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.బుధవారం విడుదలైన ట్రైలర్ మాత్రం సినిమాపై మంచి అంచనాల్ని క్రియేట్ చేస్తోంది. విద్యా విధానంలో వున్న లోపాలను ఎత్తి చూపుతూ ఈ మూవీని తెరకెక్కించారు. టీజర్ తో పాటు ఇటీవల విడుదల చేసిన లిరికల్ వీడియోలు ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. బుధవారం విడుదల చేసిన ట్రైలర్ లోని 'క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ కావాలంటే కాసులు ఖర్చు పెట్టాలి..డబ్బులున్న వాడే ఈ లెక్కని కొంటాడు..తక్కువున్న వాడు అప్పుచేసైనా కడతాడు... దయచేసి నువ్వు రాజకీయాల్లోకి మాత్రం రాకయా.. ఎడ్యుకేషన్ లో వచ్చే డబ్బు రాజకీయాల్లో రాదు.. వాళ్లు గెలిచా మనుకున్నారు...' అంటూ సాగే సంభాషణలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి.

# అక్కడ ఆడటం ఈజీ కాదన్న షంసీ! చెత్త వాగకు అంటూ కౌంటర్

చెత్త మాటలు మాట్లాడితే సహించేది లేదంటూ నెటిజన్కు చురకలంటించాడు సౌతాఫ్రికా బౌలర్ తబ్రేజ్ షంసీ.ఏదైనా మాట్లాడేటపుడు కాస్త ముందూ వెనుక ఆలోచించాలని సూచించాడు. కాగా బోర్డర్- గావస్కర్ ట్రోఫీ నేపథ్యంలో క్రికెట్ ప్రపంచమంతా టెస్టు క్రికెట్ ఫీవర్లో మునిగిపోయిందనడంలో సందేహం లేదు. ప్రపంచ టెస్టు చాంపియన్షిప్ ఫైనలిస్టులను ఖరారు చేసే టీమిండియా- ఆస్ట్రేలియా సిరీస్పైనే అందరి దృష్టి పడింది. ఈ క్రమంలో పిచ్, ఆటగాళ్ల బలాబలాలు తదితర అంశాలపై క్రీడా వర్గాల్లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా తొలి టెస్టుకు వేదికైన నాగ్పూర్ పిచ్ను డాక్టర్డ్ పిచ్ అంటూ క్రికెట్ ఆస్ట్రేలియా వ్యాఖ్యానించడం వివాదానికి దారి తీసింది. భారత జట్టు తమకు అనుకూలంగా(స్పిన్నర్లకు) పిచ్ తయారు చేయించుకుందని ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సహా మాజీలు సీఏకు గట్టి కౌంటర్ ఇచ్చారు.ఇక గురువారం భారత్- ఆసీస్ తొలి టెస్టు ఆరంభం కాగా తొలి రోజు టీమిండియానే పైచేయి సాధించింది. టీమిండియా స్పిన్నింగ్ ఆల్రౌండర్లు రవీంద్ర జడేజా ఐదు, రవిచంద్రన్ అశ్విన్ మూడు వికెట్లు తీసి కంగారూ జట్టు పతనాన్ని శాసించారు. వీరి బౌలింగ్ను ఎదుర్కోలేక ఆసీస్ బ్యాటర్లు తీవ్రంగా



ఇబ్బంది పడ్డారు.ఈ క్రమంలో.. సౌతాఫ్రికా స్పిన్నర్ తబ్రేజ్ షంసీ ఆసక్తికర ట్వీట్ చేశాడు. "ఇండియాలో ఇండియాతో మ్యాచ్ ఆడటం అంత సులువేమీ కాదు" అంటూ ఫన్నీ ఎమోజీని జతచేశాడు. ఇక ఇందుకు స్పందించిన ఓ నెటిజన్.. "నీకు ఐపీఎల్ కాంట్రాక్ట్ కచ్చితంగా వస్తుంది.. కంగ్రాట్యులేషన్స్ బ్రో" అంటూ వెటకారం ప్రదర్శించాడు. అయితే, షంసీ సదరు ట్విటిజెన్కు ఘాటుగానే బదులిచ్చాడు."నేను ఇండియాలో ఇండియాతో మ్యాచ్లు ఆడాను. బహుశా నువ్వు ఆ మ్యాచ్లు చూసి ఉండవు. నేను అక్కడ ఆడిన నా వ్యక్తిగత అనుభవం గురించి పంచుకున్నాను. నువ్వు మాత్రం ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని చెత్త వాగుతున్నావు. మన ఇద్దరి అభిప్రాయాల మధ్య చాలా తేడా ఉంది. పిచ్చిపిచ్చిగా మాట్లాడొద్దు.. థాంక్స్" అంటూ షంసీ కౌంటర్ ఇచ్చాడు.కాగా టీమిండియాతో పలు మ్యాచ్లు ఆడిన చైనామన్ స్పిన్నర్ షంసీ.. ఐపీఎల్లో రాజస్తాన్ రాయల్స్కు ప్రాతినిథ్యం వహించిన సంగతి తెలిసిందే. అయితే, ఐపీఎల్-2023 వేలం నేపథ్యంలో కోటి రూపాయల కనీస ధరతో పేరు నమోదు చేసుకోగా.. అమ్ముడుపోకుండా మిగిలిపోయాడు. దీంతో సదరు నెటిజన్ ఈ మేరకు కామెంట్ చేయగా.. షంసీ దిమ్మతిరిగేలా సమాధానమిచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190